
www.prajasakti.com
# ప్రజాశక్తి
ఆదివారం 25 జూన్ 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు : కలెక్టర్

**ప్రజాశక్తి-నెల్లూరు**
సెల్ ఫోన్లు మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడిపే వాహనదారులపై కేసులు నమోదు చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అవసరమైన సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను డిటిసి చందర్ వివరించారు. ఎస్‌పి తిరుమలేశ్వర్ రెడ్డి మాట్లాడారు. డిటిసి చందర్, డి ఎం హెచ్ ఓ పెంచలయ్య,డిఇఒ గంగా భవాని ఉన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

# అనిల్‌పై వైసిపి పెద్దలు ఆగ్రహం

**నెల్లూరు**
నగర ఎంఎల్‌ఎ అనిల్‌కుమార్‌యాదవ్ మరోసారి స్వరం పెంచారు. గత కొద్దిరోజులుగా మౌనంగా ఉన్న ఆయన ఇటీవల నగరానికి వచ్చారు. వైసిపిలో నగరంలో జరిగిన మార్పులు జరుగుతోన్న పరిణామాలపై ఘాటు విమర్శలు చేశారు. శుక్రవారం ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేసి వైసిపి పెద్దలపై విమర్శలు చేశారు. శనివారం మీడియా సమావేశం ఏర్పాటుచేసి లోకేష్ పాదయాత్రపై విమర్శలు చేశారు. అటువైపు వైసిపి పెద్దలు, ఇటువైపు టిడిపి నాయకులు అనిల్‌తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- స్వపక్షం, విపక్షంపై ఘాటు విమర్శలు
- పాత అనిల్‌ను చూస్తారంటూ బెదిరింపులు..
- అధిష్టానానికి సీనియర్లు ఫిర్యాదు

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**
నెల్లూరు నగర ఎంఎల్‌ఎ అనిల్‌కుమార్ యాదవ్ వైసిపిలో ఒంటరిగా కనిపిస్తున్నారు. ఆయన నడక, నడవడిక, మాటతీరు అధికార వైసిపి పెద్దలకు ఆగ్రహం కలిగిస్తుంది.ఇటీవల తన బాబాయ్ రూప్‌కుమార్‌యాదవ్, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్‌లతో విబేధాలు పెట్టుకొని దూరమయ్యారు. ఇతర నేతలపై బహిరంగంగా విమర్శలు చేశారు. నెల్లూరు నగరంలోని వైసిపి రెండుగా చీలిపోయింది. కొందరు కార్పొరేటర్లు రూప్‌కుమార్ వెంట, మరికొంతమంది కార్పొరేటర్లు అనిల్ వెంట నడుస్తున్నారు. ఇదే సమయంలో పలువురుపై దాడులు జరిగాయి. అనిల్‌కు వ్యతిరేకంగా బాబాయ్ రూప్‌కుమార్ యాదవ్ ఆత్మకూరు బస్టాండ్ వద్ద రాజన్న భవన్‌పేరుతో వైసిపి కార్యాలయం ఏర్పాటు చేశారు. అనిల్‌కు వ్యతిరేకంగా భారీ జనసమీకరణ చేశారు. అనిల్, రూప్‌కుమార్ మధ్య నెలకొన్న విబేధాలను చక్కబెట్టడానికి సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నాలు చేశారు. ఇటీవల కావలికి వచ్చిన సిఎం వారి ఇద్దరు నేతలను కలిపి కలిసి పనిచేయాలని చెప్పారు. ఆ మరుసటి రోజే విబేధాలు తారాస్థాయికి చేరాయి.వైసిపి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షునిగా ఎం.సునీల్‌కుమార్, వైసిపి యువజన జిల్లా అధ్యక్షులుగా శ్రీకాంత్‌రెడ్డిలను అధిష్టానం నియమించింది. వైసిపి పెద్దలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి సిఫార్సుతో వీరికి పదవులు దక్కాయి. నెల్లూరు నగరంలో తనకు తెలియకుండానే పదవులిస్తున్నారంటూ అనిల్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం సీనియర్‌నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి తన కుమారుడు గౌతంరెడ్డి పేరుతో నిర్మించిన బస్టాండ్‌ను ప్రారంభించారు. దీనికి రాష్ట్రంలోని పలువురు మంత్రులు జిల్లాలోని ఎంఎల్‌ఎలను ఆహ్వానించారు. అనిల్‌కుమార్ యాదవ్ ఆ సభకు వెళ్లకపోగా నెల్లూరు నగరంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో వైసిపి పెద్దలపైన బాబాయ్ రూప్‌కుమార్‌పైన నిప్పులు చెరిగారు. ఈ సత్తా ఏమిటో చూపిస్తానని పాత అనిల్‌కుమార్‌ను బయటకు తీస్తానంటూ మాట్లాడారు. ఈ విషయాలపై మనస్థాపం చెందిన సీనియర్‌నేతలు పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వైసిపి అధిష్టానం కూడా అనిల్ ఏర్పాటుచేసిన సభ అందులో ఏమి మాట్లాడారు..అనేక విషయాలను సేకరించింది. తాను ఇకపై నగరంలో తిరుగుతూ తాను నగరం నుంచే పోటీ చేస్తానని ప్రతి ఇంటికీ తిరుగుతానని చెప్పుకొచ్చారు. వైసిపిలోని పెద్దలు ఎవరితో సఖ్యతగా లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతుండడంతో మనస్థాపం చెందినట్లు తెలుస్తుంది.అనిల్‌కు వ్యతిరేకంగా గట్టిగా పనిచేయడానికి నెల్లూరు నగరం, జిల్లాలోని వైసిపి పెద్దలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. సొంత పార్టీలోనే విబేధాలు ఎదుర్కొంటున్న అనిల్ ప్రతిపక్షాలపై మాటల దాడి చేస్తున్నారు. ఎప్పుడూ రాజన్నభవన్‌లో మీడియా సమావేశం ఏర్పాటుచేసే ఆయన శనివారం ఒక్కడే వైసిపి జిల్లా ఆఫీసులో సమావేశం ఏర్పాటు చేశారు. లోకేష్ చేస్తున్న పాదయాత్రపై విమర్శలు చేశారు. పార్టీని వీడిన వైసిపి ఎంఎల్‌ఎలపైన విరుచుకుపడ్డారు. అనిల్ తీరుపై టిడిపి నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నగర అధ్యక్షులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు దమ్ముంటే చర్చకు రావాలంటూ సవాల్ విసిరారు. మాటతీరు సరిలేకుంటే బాగుండదంటూ హెచ్చరించారు. ఆదివారం కోటంరెడ్డి సోదరులు అనిల్‌పై గళమెత్తేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. అనిల్ ప్రవర్తన అటు సుపక్షంలోనూ ఇటు ప్రతిపక్షంలోనూ విమర్శలు తావిస్తున్నాయి. ఈ పరిణామాలు ఏలాంటి పరిస్థితులకు దారి తీస్తాయో చూడాలి.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అనిల్‌కుమార్ యాదవ్

# విద్యుత్ ఛార్జీలు తగ్గించాల్సిందే..!

## రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్

**ప్రజాశక్తి-నెల్లూరు** కేంద్ర ప్రభుత్వం షరతులకు తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంపుదల చేయడం దారుణమని, తక్షణమే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశాయి. శనివారం డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధి విధానాలతో పెట్రోల్, డీజిల్ నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. సామాన్యులకు అందని రీతిలో ధరలు పెరగడంతో జీవనం కష్టతరంగా మారిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాల అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లను బిగించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దామ అంకయ్య మాట్లాడుతూ అదనపు విద్యుత్ ఛార్జీల పేరుతో వైసిపి ప్రభుత్వం ప్రజల నుండి దోపిడీకి పాల్పడుతుందని విమర్శించారు. తక్షణమే పెరిగిన విద్యుత్ బిల్లులను తగ్గించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిరాజ్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో ప్రజాగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఎల్లంకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలను తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ నాయకులు రాంబాబు, సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి రామరాజు, సిపిఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సిపిఐ నాయకులు షాన్ వాజ్, రూరల్ నాయకులు అదినారాయణ, ఐద్వా నాయకురాలు మస్తాన్ బీ, నాయకులు ఎ.శ్రీనివాసులు ఉన్నారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

# రుణాల మంజూరులో భాగస్వామ్యం కావాలి

## బ్యాంకర్లకు కలెక్టర్ ఎం.హరినారాయణన్ సూచన

**ప్రజాశక్తి-నెల్లూరు**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి బ్యాంక్ లింకేజీ రుణాల మంజూరులో ప్రయివేటు బ్యాంకులు తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్ సూచించారు .శనివారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశం నిర్వహించారు. తొలుత గత సంవత్సరం జిల్లాలో సాధించిన బ్యాంకింగ్ ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి నిర్దేశించి లక్ష్యాలను సాధించేందుకు బ్యాంకర్లు కషి చేయాలన్నారు. కౌలు రైతులకు, ఎస్సీ,ఎస్టీ, మహిళలకు విరివిగా రుణాలు మంజూరు చేసి వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడాలన్నారు. జగనన్న తోడు, చేయూత, సున్నా వడ్డీ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు తోడ్పాటును అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ స్థాండప్ ఇండియా పథకం ద్వారా పేద ప్రజలకు సహాయం అందించుటకు బ్యాంకులు ముందుకు రావాలన్నారు.తదుపరి 2023-24 జిల్లా వార్షిక ఋణ ప్రణాళిక ను జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో కెనరా బ్యాంక్ ఆర్ఎం నాగరాజు , నాబార్డు డి డి ఎం రవి సింగ్, డి ఆర్ డి ఎ, మెప్మా, ఎపియంఐపి పీడీలు సాంబశివా రెడ్డి, రవీంద్ర, శ్రీనివాసులు, మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖ జె డి లు నాగేశ్వర రావు, మహేశ్వరుడు, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్ రాజు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

**నెల్లూరు :**జగనన్నకు చెబుదాం.. కార్యక్రమంలో వచ్చే అర్జీలను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె ఎస్ జవహర్ రెడ్డి శనివారం వెలగపూడి సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూ హక్కు, రీ సర్వే, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాల పురోగతి, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, ఆర్.డిఒలు ఉన్నారు.

## విరాళం అందజేత

**ప్రజాశక్తి-కందుకూరు :** అంకమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణంఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతోంది. అమ్మవారి పాదాల చెంత ఉంచే సువర్ణ యంత్రానికి శనివారం మంగపాటి శ్రీనివాస్ రావు ధర్మపత్ని రజిని ఒక గ్రాము బంగారం కోసం రూ 6251లు కానుకగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డికి అందజేశారు. నిర్మాణ కమిటీ సభ్యులు పిడికిటి వెంకటేశ్వర్లు,కొడాలి కోటేశ్వరరావు,భక్తులు పాల్గొన్నారు.

## పాఠశాలలో తనిఖీ

**ప్రజాశక్తి -గుడ్లూరు :** మధ్యాహ్నం భోజనం మంచిగా తయారు చేయాలని ఎంఇఒ గోవర్ధన్ కుకింగ్ ఏజెంట్లను ఆదేశించారు మండంలోని సాలిపేట పంచాయతీ పరిధిలో ఉన్న కర్లపా లెంలోఎంపిపి పాఠశాలని ఎంఇఒ శనివారం తనిఖీ చేశారు. స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇంటింటా సర్వే

**ప్రజాశక్తి- గుడ్లూరు :**మండలంలోని మోచర్లలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మోచర్లలో జరుగుతున్న ఇంటింటి సర్వేలో జిల్లా సిఇఒ చిరంజీవి శనివారం పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలు అందని వారికి వెంటనే అందించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. స్థానిక సమస్యల తోటి భూ సమస్యలు ఇతర సమస్యలు పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

## రైతులకు అవగాహన

**ప్రజాశక్తి-ఉలవపాడు :** మండలంలోని కరేడు సచివాలయం -3 పరిధిలోని అలగాయపాలెంలో శనివారం మండల వ్యవసాయ అధికారిని బి తిరుమల జ్యోతి ఆధ్వర్యంలో వేరుశనగ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా డిపిడి ఆత్మ జి శ్రీమన్నారాయణ వేరుశనగ పైరును పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. కష్ణ విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ జి శివ జ్యోతి శాస్త్రవేత్త వేత్తలు కె కిరణ్ కుమార్ రెడ్డి డి విజయ్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన

**ప్రజాశక్తి-కందుకూరు :**కందుకూరు ఎస్ఇబి స్టేషన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యావల నివారణ లో భాగంగా పట్టణంలోని వివేకా డిగ్రీ కళాశాలలో శనివారం అవగాహనా కార్యక్రమం జరిగింది. కళాశాలల విద్యార్థులు, అధ్యా పకులు పాల్గొన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి తదితర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఎస్ఇబి పరిధిలోకి వచ్చే నేరాల గురించిన తమకు సమాచారం ఉంటే 14500 టోల్ ఫ్రీ నెం బర్‌కు కూడా తమ ఫిర్యాదులను ఇవ్వవచ్చని తెలిపారు. ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేశ్వర్లు, ఐ. డి. మౌలాలి, కళాశాల ప్రిన్సిపాల్ అబ్బురి వెంకటేశ్వర్లు ఉన్నారు.

## గౌరవ వేతనం ఇవ్వాలి

**ప్రజాశక్తి-కందుకూరు :**హర్ దిల్ మే వైఎస్ఆర్ హమ్ సబ్ జగన్ కే సాత్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో జనార్ధన కాలనీలోని మదీన మసీదులో హర్ దిల్ మే వైఎస్ఆర్ హం సబ్ జగన్ కె సాత్ కార్యక్రమం నిర్వహించారు జిల్లా వక్ బోర్డ్ సభ్యులు సంధాని బాషా మాట్లాడారు.ఎంఎల్ఎ మాను గుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నా మన్నారు. ఇమామ్ ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. వైసిపి అధ్యక్షులు రఫీ ,యువ నాయకులు రహీం, మస్తాన్, బాబు ఉన్నారు.

## పార్కు ప్రారంభం

**ప్రజాశక్తి-కందుకూరు :** కందుకూరు పట్టణంలోని ముత్యాల కుంట వద్ద రూ. 40 లక్షలతో ఆధునీకరించిన కందుకూరు ఉద్యానవన పార్కును ఎంఎల్ఎ మాను గుంట మహీధర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్,నెల్లూరు జెడ్‌పి సిఇఒ చిరంజీవి తదితరలుఉ పాల్గొన్నారు.



# 'లలితా జ్యూవెలరీ' షోరూమ్ ప్రారంభం

**ప్రజాశక్తి -నెల్లూరు డెస్క్** :నెల్లూరు నగరంలోని మాగుంట లే అవుట్‌లో శనివారం లలితా జ్యూవెల్లరీ 50వ షోరూమ్ ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డితోపాటు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు కార్పొరేషన్ మేయర్ పి సవంతి, నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. సా యంత్రం 5 గంటలకు ఈ షోరూమ్ ప్రారంభోత్సవ వేడుక మంత్రి కాకాణి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. లలితా జ్యూవెల్లరీ షోరూమ్ అధినేత డాక్టర్ ఎం కిరణ్‌కుమార్ కుమారుడు భక్తి కిరణ్, భవ్య కిరణ్‌ల చేతులు మీదుగా షో రూమ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యూవెల్లరీ షోరూమ్ అధినేత డాక్టర్ ఎం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తనకు నెల్లూరు ఓ ప్రాంతం మాత్రమే కాదని, తన జీవితంలో ఎదుగుదల అన్న మాటకు అక్షరాలు అద్దుకున్న ప్రతిరూపమని తెలిపారు. అడుగడుగునా తనను ఉన్నత స్థాయికి చేర్చిన, అలుపు లేకుండా శ్రమించే తత్వాన్ని నేర్పిన గడ్డ.. అన్నారు. తన జీవితంలో ఎంతో మహోత్తరమైన అనుబంధమున్న మాతృభూమి నెల్లూరు అని తెలిపారు. 12 ఏళ్ల వయస్సులో ఓ నగరల ఫ్యాక్టరీలో కూలీగా పనిచేసిన ఇదే నెల్లూరులో తాను కలలు కన్న 50వ షోరూమ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ షోరూమ్ నెల్లూరు ప్రజలదని, నెల్లూరులో ఉన్న ప్రతి ఒక్కరిది అని తెలిపారు. నెల్లూరుతోపాటు సూళ్లూరుపేట, గూడూరులలో ఒకే రోజు మూడు షోరూమ్‌లు ప్రారంభించడం సంతోషంగా ఉంద న్నారు. బంగారం ఓ అలంకార వస్తువు మాత్రమే కాదన్నారు. అది అవసరానికి ఆదుకునే ఆపద్బా ంధవ పెట్టుబడి అని తెలిపారు. సరైన అవగా హనతో ప్రజలు నగులు కొనుగోలు చేయాలన్నదే తన ఆశయమని కిరణ్‌కుమార్ తెలిపారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి 'కాకాణి'

## 26 నుంచి బస్సు యాత్ర : ఇంటూరి

**ప్రజాశక్తి -కందుకూరు :** ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ ఈనెల 26వ తేదీ నుంచి టిడిపి ఆధ్వర్యంలో బస్సుయాత్ర జరుగుతుందని కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. నెల్లూరు పార్లమెంటుకు సంబంధించిన బస్సు యాత్ర కందుకూరు నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం టిడిపి ప్రభుత్వం హయాంలో కందుకూరులో నిర్మించిన టిట్కో గహాలను సందర్శిస్తామని తెలిపారు. అనంతరం రాళ్ళ పాడు ప్రాజెక్టుని సందర్శించి గ్రామాల్లో బస్సు యాత్ర సాగుతుందని తెలిపారు. జయప్రదం చేయాలని కోరారు. టిడిపి నాయకులు దామ మల్లేశ్వరరావు, గోచిపాపల మోషే ,చిలకపాటి మధు, షేక్ రఫీ, ముచ్చు శ్రీనివాసరావు ఉన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టిడిపి చేపట్టిన బస్సు యాత్ర 26న సాయంత్రం గుడ్లూరు వస్తుందని కందుకూరు నియోజకవర్గం టిడిపిఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. గుడ్లూరులోని పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం మండల స్థాయి సమావేశం, పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడారు. బస్సు యాత్రను జయప్రదం చేయాలన్నారు. పువ్వాడి వేణుగోపాల్ చిత్తారి మల్లికార్జున నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మద్దసాని కష్ణ తిరుపతి వెంకయ్య క్లస్టర్ ఇంచార్జ్ ఉమ్మనేని సుబ్బారావు, మండల మహిళా కమిటీ అధ్యక్షురాలు రమణమ్మ ఉన్నారు.


కందుకూరులో మాట్లాడుతున్న ఇంటూరి

# 'నారాయణ'లో డయాలసిస్ రోగి మృతి

## మృతుడి కుటుంబ సభ్యుల ఆందోళన - సూపరింటెండెంట్‌పై దాడికి యత్నం

**ప్రజాశక్తి-నెల్లూరు :**కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్య చికిత్సల నిమిత్తం అరవ మల్లికార్జున (34)అనే వ్యక్తి శనివారం నారాయణ వైద్యశాలలో చేరారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు డయాలసిస్ చేయాలని రోగి బంధువులకు తెలిపారు. వారి అంగీ కారంతో డయాలసిస్ ప్రారంభించారు. అదే సమయంలో మరి కొన్ని అనారోగ్య సమస్యలు తలెత్తడంతో కార్డియాక్ అరెస్టు కావడంతో మల్లికార్జున మృతి చెందారు. డయాలసిస్ చేస్తున్న వ్యక్తి మృతి చెందిన సమాచారం తెలుసుకున్న రక్తసంబం దీకులు డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహారం చడంతోనే మృతి చెందారని నారా యణ వైద్యశాల ఎదుట ఆందోళన చేపట్టారు. వైద్యశాల సూపరిం టిండెంట్ హరిప్రసాద్‌రెడ్డి మృతుని బంధువులతో మాట్లాడి వైద్యం చేసే సమ యంలో చోటు చేసుకున్న విషయాన్ని వివ రించేందుకు గదిలోకి పిలిపించారు. దీంతో మృతుడి బంధువులు సూపరిం టిండెంట్ హరిప్రసాద్‌రెడ్డిపై దాడికి యత్నించారు.



### వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మరణం సంభవించలేదు..

**డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి , సూపరింటిండెంట్**

అరవ మల్లికార్జున 34 ఏళ్ల వ్యక్తికి తమ వైద్యశాలలో వైద్యులు డయాలసిస్ చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఆ వ్యక్తి కిడ్నీ సంబంధిత సమస్యతోపాటు గుండె సంబంధీత సమస్యతో బాదపడుతున్నారని, హెపటైటీస్ వంటి అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. గతంలో కోవిడ్ సైతం వచ్చినట్లు మృతుని బంధువులు తెలిపారు. తీవ్రమైన అనారోగ్య సమస్యల కారణంగా డయాలసిస్ చేసే సమయంలో ఇటువంటి ప్రమాదం జరిగేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఆ సమాచారం రోగి సంబంధిత బంధువులకు సైతం తెలియజేశామన్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మరణించలేదు..

## 27న మండల సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి-వలేటివారిపాలెం :** వలేటివారిపాలెం మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 27న మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశపు హాలు నందు ఎంపిపి పొనుగోటి మౌనిక అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ షేక్ రఫీక్ అహ్మద్ తెలిపారు. జెడ్‌పిటిసి ఇంటూరి భారతి, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కోఆప్షన్ సభ్యులు హాజరవుతారన్నారు.

## నిందితులు అరెస్టు

**ప్రజాశక్తి-నెల్లూరు** :వ్యసనాలకు బానిసలైన ,పగలు సమాజంలో సంచరిస్తూ తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి సమయాల్లో ఆతాళలను పగలగొట్టి ఇంటిలోని ఆభరణాలను, నగదు, వస్తువులను దొంగలించి తప్పించుకొని తిరుగుతున్న ముగ్గురు నిందితులను సిసిఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.13.80 లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురు నిందితులు గతంలో నేర చరిత్ర కలిగిన వారుగా పోలీసులు గుర్తించారు. శనివారం సిసిఎస్ పోలీసు స్టేషన్‌లో సిసిఎస్ డిఎస్‌పి శివాజ రాజా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి నిందితుల వివరాలు వెల్లడించారు.

## బాలలను పనిలో పెడితే చర్యలు

**ప్రజాశక్తి-నెల్లూరు**
బాల కార్మికులను పనిలో పెట్టుకుంటున్న యాజమాన్యాలపై జరిమానాలతో సరిపెట్టకుండా తప్పనిసరిగా కేసులు నమోదు చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం దర్గామిట్టలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ పై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు ఈనెలలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలపై జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమాలు చాలా చక్కగా నిర్వహించారని, ఈ నెలలో 23 కేసులను నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ మాధవి, ఐసిడిఎస్ పిడి సౌజన్య, బాలల సంరక్షణ అధికారి సురేష్, జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'జగనన్న సురక్ష' సర్వే పర్యవేక్షణ

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు** :జగనన్నకు చెబుదాం.. కార్యక్ర మానికి అనుబంధంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్ర మాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ ఎం హరినారా యణ్ పేర్కొన్నారు. రాష్ట్ర పభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన జగనన్న సురక్ష సర్వే పనితీరు ను శనివారం జిల్లా కలెక్టర్ మండలంలోని సౌత్ ఆములూరు గ్రామంలో స్వయంగా పర్యవేక్షిం చారు. ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కొత్తగా ప్రవేశ పెట్టారన్నారు. సర్పంచ్ చెరుకూరు స రళ, మండల పరిషత్ ఉపాధ్య క్షులు శ్రీనివాసులు నాయుడు, ఎంపిడిఒ కన్నం హేమలత, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఉన్నారు.

## మున్సిపల్ కార్మికుల పోరాటానికి డివైఎఫ్ఐ మద్దతు

**ప్రజాశక్తి-నెల్లూరు** :నగరపాలక సంస్థలో మున్సిపల్ కార్మికులు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ చేస్తున్న పోరాటానికి డివైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శనివారం 51, 52 డివిజన్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు నెల్లూరు అర్బన్ తహశీల్దార్ ఆఫీస్ సెంటర్లో ధర్నా చేపట్టారు. డివైఎఫ్ఐ నాయకులు పాల్గొని కార్మికులు చేస్తున్న ఆందోళనకు సంఘీభావం తెలిపారు. డివైఎఫ్ఐ నగర కార్యదర్శి బీపీ నరసింహ మాట్లాడుతూ నెల్లూరు నగరపాలక సంస్థలో పనిచేయుచున్న కార్మికులు అనేక రోజుల నుంచి వివిధ రూపాల్లో ఆందోళన కొనసాగిస్తున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయకుండా మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి ఎం అశోక్, నాయకులు యాకోబు,లాజర్, చిన్ని, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు




## విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి..!

**ప్రజాశక్తి-వలేటివారిపాలెం** :విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పోకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్ర విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఉన్నత విద్యతో పాటు మండల ప్రాథమిక విద్య కూడా ఇక్కడే అందుబాటులో ఉండటంతో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ కొండసముద్రం, కూనిపాలెం, మాల కొండరాయునిపాలెం గ్రామాలకు శనివారం వెళ్లారు. తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలలో జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక, అమ్మఒడి తదితర పథకాలకు ఇక్కడ చదవడం వలన లబ్ది పొందవచ్చునని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠ శాలల్లో చదివిన విద్యార్థులు ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించవచ్చునని చెప్పారు. ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను సైతం కలిసి మాట్లాడారు. సిఆర్‌పి వామన గుంట రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## 4వ వార్డు టిడిపి అధ్యక్షులుగా మనోహర్

**ప్రజాశక్తి-కందుకూరు :** కందుకూరు పట్టణంలోని 4వ వార్డు టిడిపి అధ్యక్షుడిగా మచ్చా మనోహర్ ను నియమించారు. ఈ మేరకు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు మనోహర్‌కు శనివారం నియామక పత్రం అందజేశారు. మల్లేశ్వరరావు మాట్లాడుతూ వార్డులో పార్టీ అభివద్ధికి కషి చేయాలని, సీనియర్ల సలహాలు తీసుకుంటూ పార్టీ కార్యక్రమాలు సమిష్టిగా నిర్వహించాలని సూచించారు. తనను వార్డు అధ్యక్షుడిగా నియమించిన పార్టీ ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు గారికి, పట్టణ అధ్యక్షులు మల్లేశ్వరరావుకు మనోహర్ కతజ్ఞతలు తెలిపారు. మల్లేశ్వరరావును మనోహర్ సత్కరించారు. పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, ఉపాధ్యక్షుడు రవిచంద్ర, పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య, రాష్ట్ర వాణిజ్యవిభాగం కార్యనిర్వాహక కార్యదర్శి కూనం నరేంద్ర, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పొడపాటి మహేష్ ఉన్నారు.

## 'మాలకొండ' ఆదాయం రూ. 13 లక్షలు

**ప్రజాశక్తి-వలేటివారిపాలెం** :మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆవరణలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా కనిపించింది. అష్టోత్తరం పూజలకు రూ. 6900, కుంకుమార్చన రూ. 26,520, తలనీలాలు రూ. 55,850, వాహనపూజలు రూ. 5,440, ప్రత్యేక దర్శనం 2697 మంది ద్వారా రూ. 2,69,700, స్థలపురాణం రూ. 740, రూము అద్దెలు రూ. 30,040, కవర్లు రూ. 6,600, లడ్డూ ప్రసాదం అమ్మినందుకు రూ. 2,02,350, అన్న దానం విరాళం రూ. 3,30,611, ఇతర విరాళాలు రూ. 4,46,050 కలిపి మొత్తంగా రూ. 13,70,801 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ కెబి శ్రీనివాసరావు తెలిపారు.

## ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

**ప్రజాశక్తి-జలదంకి** : అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం మంజూరు చేసే పథకాలను అందజేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని డిప్యూటీ తహశీల్దార్ భరత్ తెలిపారు. అన్నవరం సచివాలయ కేంద్రంలో శనివారం సర్పంచ్ గుమ్మడి మార్తమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష పథకాన్ని అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిటి భరత్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందని అర్హులకు వెనువెంటనే జగనన్న సురక్ష ద్వారా అందజేయాలని కోరారు. మండల ఉపాధ్యక్షులు పాలపర్తి మాలకొండ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రేవతి, వైసిపి నాయకులు గుమ్మడి రమేష్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సు

**ప్రజాశక్తి-జలదంకి** : భూములకు సంబంధించి సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సును ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గట్టుపల్లి సర్పంచ్ కకాని ప్రశాంతి తెలిపారు. మండలంలోని గట్టుపల్లిలో శనివారం సర్పంచ్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తహశీల్దార్ సిహెచ్ పద్మావతి మాట్లాడుతూ సాదా బైనామా భూములకు సంబంధించి లిఖితపూర్వక ఆధారాలు ఉంటే వారికి కూడా పట్టాలు మంజూరు చేస్తామన్నారు. సదస్సులో ఉప సర్పంచ్ గుమ్మలంపాటి సుబ్బారావు, వీఆర్ఓ చెన్న కృష్ణయ్య, ఆర్ఐ శ్రీనివాసులు, వైసిపి నాయకులు కకాని మహేష్, వర్షిని మురళి, దివ్య, నరేంద్ర, వీఆర్ఏలు రమేష్, హజరత్, మస్తాన్, సుభాషిణి, రైతులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాశక్తి-కోవూరు** : జిల్లాలోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాల గీతాంజలి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు వందమంది పైగా కళాశాల పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. సందీప్ కుమార్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా కళాశాల పూర్వ విద్యార్థులు కలుసుకుని అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని కళాశాల మౌలిక సదుపాయాలు మెరుగుపరచడానికి నాణ్యమైన పరికరాలు కొనుగోలుకు కళాశాల అభివృద్ధికి వినియోగిస్తున్నామన్నారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా కళాశాల ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ టి. రవికుమార్, వ్యవస్థాపకుడిగా ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణంలో తనిఖీలు

**ప్రజాశక్తి-ఉదయగిరి** : ఎరువుల పురుగుమందుల దుకాణాల్లో జిల్లా అసిస్టెంట్ అగ్రికల్చర్ అధికారి శ్రీనివాసులు తనిఖీ చేశారు. శనివారం స్థానిక దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి స్టాకు రిజిస్టర్, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు స్టాకు కొనుగోలు చేసినప్పుడు తప్పక రశీదులు ఇవ్వాలని దుకాణ యాజమానులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎరువుల నిల్వలను ఆయన పరిశీలించారు. ఇన్‌ఛార్జి ఎడిఎ చెన్నారెడ్డి పాల్గొన్నారు.

## వరిపంట పరిశీలన

**ప్రజాశక్తి-అనంతసాగరం** : మండలంలోని లింగంగుంట రైతు భరోసా కేంద్రం పరిధిలోని వెంగంపల్లిలో పాలిమేర ప్రసాద్ శనివారం వరి పొలాలను మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి సందర్శించారు. పొలంలో సుమారు 40 సెంట్లు విస్తీర్ణంలో 8 ఎకరాలకు సరిపడా నెల్లూరు మసూర నారు గమనించామని నారుమడిలో పొటాష్ వాడకం తప్పనిసరిగా ఉండాలని, అధిదిగా నాటేటప్పుడు నారు ఆకు కొనలు తుంచి వేయడం వల్ల కాండం తొలుచు పురుగు గుడ్లను ప్రధాన పొలంలోకి రాకుండా అరికట్టవచ్చన్నారు. నెలాఖరులోపు అర్హులైన రైతులు పిఎం కిసాన్ ఈకెవైసి చేయించుకుంటేనే 14వ విడత అమౌంట్ జమ అవుతుందని, ప్రతి కౌలురైతు కచ్చితంగా ప్రభుత్వం వారు అందజేసే సిసిఆర్సి కార్డు తీసుకోవాలన్నారు.

## పొదిలి రాము నియామకం

**ప్రజాశక్తి-కలిగిరి** : ఉదయగిరి నియోజకవర్గం నుంచి పూసల బిసి సాధికారత జిల్లా కో కన్వీనర్‌గా పొదిలి రాముని నియమించినట్లు మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకట రామారావు తెలిపారు. శనివారం కలిగిరి క్యాంపు కార్యాలయంలో పూసల సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. లోకేష్ పాదయాత్ర సందర్భంగా ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేయాలని వారు బొల్లినేని వెంకట రామారావును కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి నారా లోకేష్ దృష్టికి పూసల సంఘం సమస్యలను తీసుకెళ్లి వారికి ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పూసల నాయకులు పాల్గొన్నారు.

## బుడంగుంటలో అన్నదానం

**ప్రజాశక్తి-కావలి** : కావలి పట్టణం నివాసులు కలిగిరి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఒట్టూరు.శ్రీనివాసులు-నీరజ దంపతుల మనవడు, కొడుకు కోడలు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా జర్మనీలో విధులు నిర్వహిస్తున్న ఒట్టూరు.నవ్యతేజ - శరణ్యల దంపతుల కుమారుడైన ఒట్టూరు.లిషాన్‌రామ్ మొదటి పుట్టినరోజు సందర్భంగా శనివారం సంయుక్త సేవాసంస్థ ద్వారా బుడంగుంట గిరిజన ప్రాంతంలో ఉన్న పేదలందరికీ అన్నదానం చేశారు. అలాగే పేద పిల్లల మధ్య తన మనవడు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసిన అనంతరం పేద పిల్లలకు నూతన వస్త్రాలు, వృద్ధ మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో నేటి దాత ఎస్ఐ ఒట్టూరు.శ్రీనివాసులు - నీరజ దంపతుల లిషాన్ రామ్ అమ్మమ్మ తాతయ్యలు ఉప్పలపాటి.శ్రీనివాసులు - వెంకట రమణమ్మ దంపతుల వారి కుటుంబ సభ్యులు ఆత్మకూరు కల్యాణ్-విజయలక్ష్మి దంపతులు, చిన నాన్నలు ఒట్టూరు చిత్ర రెడ్డి, నరసింహారావు-నందిని దంపతులు, సంయుక్త సేవా సంస్థ గౌరవ సభ్యులు యమ్ అజిత్ బాబు, ఎమ్ఎస్ఎన్ ప్రసాద్ రావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, వలంటీర్లు 9 దుర్గారావు, మహబూబ్ బాషా, షఫీ లు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లు

**ప్రజాశక్తి-కావలి** : కావలి పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చేరదలచిన విద్యార్థిని విద్యార్థులు స్థానిక రుద్రకోట, కావలిలో స్థాపించిన గవర్నమెంట్ పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లకు గాను అప్లికేషన్లు ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సుశీల్ కుమార్ ప్రియా ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు అప్లికేషన్ కళాశాల ఆఫీసులో పొందవచ్చున్నారు. వివరాల కోసం అడ్మిషన్ ఫ్యాకల్టీ డాక్టర్ జి.ఎస్.హేమంత్ కుమార్ 9440707944, బి.శివకుమార్ రెడ్డి 9849203455, ఎ.సురేష్ బాబు 8328095743లను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

## నగదు ప్రోత్సాహకాలు అందజేత

**ప్రజాశక్తి-మర్రిపాడు** : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ప్రతిభను కనబరిచి జగనన్న ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు పద్మలత ఎస్ఎంసి చైర్మన్ దుంపలగట్ల వెంకటేశ్వర్లు శనివారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలను కైవసం చేసుకున్న విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల చేతుల మీదుగా పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం కార్యాచరణను ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల అత్యున్నత స్థాయికి ఎదగాలన్న మహోన్నత ఆశయంతో జగనన్న ఆణిముత్యాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం విద్యార్థులలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, ప్రసాద్, నాగరాజు, చిన్నపరెడ్డి, ప్రసన్న శ్రీలక్ష్మి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి బిట్రగుంట** : బోగోలు మండలం పాత బిట్రగుంట గ్రామంలో ఉన్న జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో తమ్మినేని కృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్, గీతాంజలి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వారి సహకారంతో బోగోలు మండలంలోని జిల్లా ప్రజా పరిషత్, గురుకుల పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరం నందు పదవ తరగతిలో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.5వేల నగదు పారితోషకాన్ని ట్రస్ట్ ఫౌండర్ స్వర్గీయ సేవా సంస్థల ఐక్యవేదిక అధ్యక్షులు తమ్మినేని పాండు బహుమతి ప్రదానం చేశారు. జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పాత బిట్రగుంట విద్యార్థి పరుసు హేమంత్ మండల స్థాయిలో ప్రథమ స్థానం నియోజకవర్గ స్థాయిలో తృతీయ స్థానము పొందాడు. ఈ విద్యార్థికి ఆతనితోపాటు మండలంలోని ఎనిమిది పాఠశాలల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు రూ.5వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ జయమ్మ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవితే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నసమ్మ మండల కమిటీ చైర్మన్ మధ్దులూరి ప్రసాదరావు, మండలంలోని అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-కావలి** : వెంగళరావు నగర్ శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో స్కూల్ ఫస్ట్, సెకండ్, థర్డ్ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన "జగనన్న ఆణిముత్యాలు" నగదు బహుమతులను శనివారం హెడ్ మాస్టర్ సుబ్బారావు విద్యార్థులకు అందజేశారు. స్కూల్ ఫస్ట్ నియోజకవర్గం నుంచి ఫస్ట్ బహుమతి గెలుపొందిన సుమాలశెట్టి రూ.3వేలు, స్కూల్ సెకండ్ రూపశ్రీకి రూ.2వేలు, స్కూల్ థర్డ్ షేక్ ఖాజాకరీంకి రూ.1,000 అందించారు. ఈ సందర్భంగా పాఠశాల పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ ఘనీబాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్యకు అత్యధిక ప్రాధాన్యతను కల్పిస్తున్నారని ఇప్పటికే ఉన్నది, నాడు -నేడు ద్వారా పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ గోళ్ళ అమరజ్యోతి, స్కూల్ అసిస్టెంట్ సయ్యద్ హయ్యూమ్, ఉపాధ్యాయులు టి.కొండారెడ్డి, శ్రీనివాసులు, శ్రీ లక్ష్మి, శ్యామల, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కరెంటు ఛార్జీలను తగ్గించాలని వామపక్షాల ధర్నా




**ప్రజాశక్తి-కావలి**

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరెంటు ఛార్జీలు, ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే విధానాన్ని విరమించుకోవాలని శనివారం వామపక్ష పార్టీలు సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్), ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్యాంక్ పార్టీల ఆధ్వర్యంలో కరెంటు డివిజనల్ ఈ.ఈ.ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఈ టెక్నికల్ యస్థాని బాషాకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పి.పెంచలయ్య మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాను అధికారంలోకి వస్తే, పేదలకు మంచి పరిపాలనను అందిస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు సంవత్సరాల కాలంలో ఇప్పటికే సుమారు 8సార్లు కరెంటు ఛార్జీలు పెంచి ప్రజలపై భారాన్ని మోపారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలను అమలు చేస్తూ ఇప్పటికే పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచడం జరిగిందని ఇప్పుడు ట్రూ అప్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై మోయలేని భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం మోపిందన్నారు. అంతేకాకుండా మళ్లీ స్మార్ట్ మీటర్లు పెట్టే విధానం తీసుకొచ్చి, వేల రూపాయలు భారాన్ని ప్రజలపై మోపాలని చూస్తున్నదన్నారు. ఇది సరైన విధానం కాదని ఈ పరిపాలన చూస్తుంటే అదాని పరిపాలన అనిపిస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అన్ని రకాల కరెంటు ఛార్జీలను తగ్గించాలని స్మార్ట్ మీటర్లు పెట్టే విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కరెంటు ఛార్జీలను తగ్గించేంత వరకు ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. సిపిఐ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తూ ప్రజలపై అనేక రకాలుగా భారాలను మోపుతుందన్నారు. ప్రస్తుత రోజుల్లో నిత్యావసర వస్తువులు కొని తినలేని పరిస్థితుల్లో ఉన్నారని గతంలో రూ.450 గ్యాస్ ఉంటే ఇప్పుడు రూ.1150 అయిందన్నారు. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో విపరీతంగా అన్ని రకాల నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగాయని దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కరెంటు ఛార్జీలు పెంచడం ఏ మేరకు సబబు కాదని రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరెంటు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు ఎల్.శ్యామల, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు పి.మహేష్ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.మధుసూదన్ రావు, పి.తిరుపాలు, బి.కృష్ణయ్య, సిపిఐ కార్యదర్శి కె.నాగరాజు, నరసింహారావు, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు రవికాంత్, సిఐటియు నాయకులు వై.కృష్ణమోహన్, టి.రత్నం, ఎఐటియుసి నాయకులు మల్లి అంకయ్య, గుంజి కిషోర్, డివైఎఫ్ఐ నాయకులు పి.పెంచల నరసింహం, కె. చెన్నయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

**విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలి : సిపిఎం**



మాట్లాడుతున్న తాళ్లూరు మాల్యాద్రి

**ప్రజాశక్తి-జలదంకి** : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం డిమాండ్ చేసింది. స్థానిక సురే చెంచురెడ్డి భవనంలో శనివారం సిపిఎం నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పెరిగిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని లేకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అలాగే వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే ప్రతిపాదనను విరమించుకోవాలని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఫిక్స్‌డ్ ప్రూఫ్ కస్టమర్ ఛార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై అధిక బారాలు మోపుతుందని ఇది సరైన పద్ధతి కాదని హితవు పలికారు. కేవలం రెండు రూపాయలకే యూనిట్ విద్యుత్ వస్తున్న నేపథ్యంలో కరెంటు చార్జీలు తగ్గించాల్సి ఉందన్నారు. ఇందుకు భిన్నంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదనపు ఛార్జీలు వసూలు చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ రంగాన్ని అదానికి అప్పచెప్పేందుకు ప్రభుత్వాలు కుయుక్తులు పన్నుతున్నాయని ధ్వజమెత్తారు. ప్రజలకు ఆమోగ యోగ్యమైన తమ డిమాండ్లను అంగీకరించకపోతే ఐక్య పోరాటాలకు సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం గ్రామ కార్యదర్శి మేలంగి ఆంథోని బాబు, వ్యకాసం మండల ఉపాధ్యక్షులు బత్తల నరసింహ, కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి శివ శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## దళితులకు ఆర్థికసాయం అందజేత

**ప్రజాశక్తి-కలిగిరి** : మండలంలోని కృష్ణారెడ్డిపాలెం పంచాయతీలో శనివారం అనారోగ్యంతో బాధపడుతున్న ఆరు దళిత కుటుంబాలకు మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకట రామారావు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలోని పలు అనారోగ్య సమస్యలతో మంచం పట్టిన భాధిత కుటుంబాలైన కొంజేటి వెంకటేశ్వర్లు, తోకల మాల్యాద్రి, గంగపట్ల లక్ష్మయ్య, కర్రా కటాక్షం, కొణిజేటి నాగులు, కేశనపల్లి లత ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ పరిస్థితులను, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట మండల పార్టీ అధ్యక్షులు బిజ్జం వెంకట కృష్ణారెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు చాగంటి జయరామిరెడ్డి, ఉసా మాల్యాద్రి, పీ.వి సుబ్బారావు, నరేంద్ర, తొకల రాములు, వేణు, కొండారెడ్డి, జయరాం తదితరులు పాల్గొన్నారు.

## రాయపేటలో వెలిగిన విద్యుత్ దీపాలు

**– ప్రజాశక్తి కథనానికి స్పందన**

**ప్రజాశక్తి-అల్లూరు** : మండలంలోని రాయపేట గ్రామస్తులు గత కొద్ది రోజుల నుండి విద్యుత్ దీపాలు వెలగక అంధకారంలో ఉండగా వెలగని వీధి దీపాలు అంటూ ప్రజాశక్తిలో కథనాన్ని ప్రచురించడంతో అధికారులు వెంటనే మేలుకున్నారు. కాగా నగర పంచాయతీ అధికారులు హుటాహుటినా స్పందించి శనివారం విద్యుత్ దీపాలను వెలిగించడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చెంతాటి జార్జ్ మాట్లాడుతూ ప్రజాశక్తి కథనంతో ఎట్టికేలకు అధికారులు స్పందించి లైట్లు వేసి వెళ్లారని హర్షం వ్యక్తం చేశారు.



## ఆత్మీయ సమావేశానికి తరలిన వైసిపినేతలు

**ప్రజాశక్తి-ఉదయగిరి**

మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి ఆత్మీయ సమావేశానికి ఉదయగిరి వైసిపి నేతలు బ్రాహ్మణపల్లికి శనివారం అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ముందుగా ఆయన సోదరుడు మేకపాటి రాజగోపాల్ రెడ్డిని కలిసి ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నెల్లూరు మాజీ పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి ఉదయగిరి నేతలతో మాట్లాడుతూ తన సోదరుడు మేకపాటి రాజగోపాల్ రెడ్డి పేరు అధిష్టానం వద్ద ఖరారైందని తెలిపారు. రెండు రోజుల లోపల అధిష్టానం ఖరారు చేస్తుందని ఆశాభవం వ్యక్తపరిచారు. గత 40 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నామని తనను ఆశీర్వదించినట్టుగానే తన తమ్ముడు రాజగోపాల్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలు తనకు రెండు కళ్లు లాంటివి అని అన్నారు. రెండు నియోజకవర్గాలు అభివృద్ధి చేయడమే మేకపాటి కుటుంబం ధ్యేయమన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ కళాశాలలు రూపొందించామని నియోజకవర్గ ప్రజలకు అంకితం చేశామన్నారు. కాసులకు మోసపోకుండా ప్రతిపక్షాలపై రాజీ లేని పోరాటం చేసి అందరి దయవల్ల నేడు ఇలా ఉన్నామన్నారు. తన తమ్ముడు రాజగోపాల్ రెడ్డిని ఉదయగిరి నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలిపించే బాధ్యత అందరిపై ఉందన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తల బలంతోనే తమ్ముడిని బరిలోకి దింపుతున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబరపడిన నాయకులు ఉదయగిరి గడ్డ మేకపాటి అడ్డా" అంటూ కేరింతల కొట్టారు. త్వరలోనే ఉదయగిరి నియోజకవర్గంలో ఆగిపోయిన గడపగడపకు కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఉదయగిరి ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతయ్య, సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, మండల కన్వీనర్ అక్కి భాస్కర్ రెడ్డి, సచివాలయం మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ మూలే సుబ్బారెడ్డి, అక్కుల్ రెడ్డి, ఎస్‌సి సెల్ నాయకుడు గడ్డం హాజరత్తయ్య, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌జైల్లో న్యాయ విజ్ఞాన సదస్సు

**ప్రజాశక్తి-కావలి**

కావలి సబ్ జైలులో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా కావలి మండల లోక్ అదాలత్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కుమారి. ఆర్.వరలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై, అక్కడ ఉన్న ఖైదీలకు కొన్ని చట్టాలను వివరించారు. అలాగే సమాజంలో చెడు ప్రభావాలను విడిచి, మంచిగా మెలగాలిలని తెలిపారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ మెంబర్, న్యాయవాది ఐ.సాయిప్రసాద్, లోక్‌అదాలత్ మెంబర్ ఎం.మాలకొండారెడ్డి, జైలు సూపరింటెండెంట్ చిన సుబ్బయ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ లేఅవుట్లపై అనర్హత వేటు

**ప్రజాశక్తి-కలిగిరి**

మండలంలోని నాగసముద్రం రెవెన్యూ పంచాయతీలో ఉండే అన్ని లే అవుట్లను పరిశీలించి వీటికి గ్రామపంచాయతీ అనుమతులు లేవు కనుక ఇవి అక్రమ లేఅవుట్లుగా గ్రామపంచాయతీలు తీర్మానం చేసినట్లు విస్తరణ అధికారి వెలుగోటి మధు తెలిపారు. కావలి ఉదయగిరి హైవే రోడ్డు నిర్మాణ పనులు నేపథ్యంలో విచ్చలవిడిగా అనుమతి లేని అక్రమ లేఅవుట్లు వేస్తున్నారని తెలిపారు. సర్వే నంబర్ 102 లో 5.22 సెంట్లు భూమిని కొత్తగా ప్లాట్లు చేసి అక్రమ లే అవుట్ ఏర్పాటు చేశారన్నారు. దీనిని అతిక్రమించిన ల్యాండ్ యాజమాన్యంపై 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టము నందలి సెక్షన్ 121 అనుసరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగసముద్రం సర్పంచ్ శ్రీనివాసులు, వీర్నకల్లు సెక్రటరీ మల్లికార్జున పాల్గొన్నారు.

## లే అవుట్‌లో పరిశీలన

**ప్రజాశక్తి-ఉదయగిరి**

జగనన్న సురక్ష సర్వేను జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను జిల్లా పంచాయతీ అధికారిణి సుస్మితారెడ్డి పరిశీలించారు. శనివారం మండల పరిధిలోని శకునాల పల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను పరిశీలించి అలాగే జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను జిల్లా అధికారిని సుస్మితా రెడ్డి పరిశీలించారు. అనంతరం సచివాలయం తనిఖీ చేసి సిబ్బంది శాఖ సంబంధిత వ్యక్తిగత రిజిస్టర్‌లు తనిఖీ చేశారు. జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న నిర్మాణాలను వేగవంతంగా నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి కరిముల్లా, ఇంజనీరింగ్ అసిస్టెంట్ షరీఫ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## నైపుణ్యంతో ఉన్నత ఉద్యోగాలు

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

ఏ రంగంలోనైనా ఉన్నతస్థాయికి చేరాలంటే నైపుణ్యం అవసరమని, అప్పుడే పనిచేసే చోట ఉన్నతస్థాయికి చేరేందుకు అవకాశముంటుందని, ప్రతి ఒక్కరూ వృత్తి నైపుణ్యంపై శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించాలని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలో పాలిటెక్నిక్ కళాశాలలో తొలుత స్కిల్ హబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ జాబ్‌మేళాకు వచ్చే నిరుద్యోగ యువత కొందరు ఇంటర్వ్యూలకు హాజరయ్యే సమయంలో జీతం తక్కువగా ఉందని ఆలోచిస్తున్నారని, జీవితంలో ప్రతి ఒక్కటి ఆరంభంలో తక్కువే ఉంటుందని, మీ నైపుణ్యం చూపితే కంపెనీలే మీరు కొరినంత జీతం ఇచ్చేందుకు ముందుకు వస్తాయని వివరించారు. శనివారం జరిగిన జాబ్ మేళాకు 19 కంపెనీలు




మాట్లాడుతున్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఇంటర్వ్యూలు నిర్వహించగా 778 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. వారిలో 315 మంది వివిధ కంపెనీలకు ఎంపిక కాగా 121 షార్ట్ లిస్ట్ చేసినట్లు వివరించారు. డిఎస్‌డిఒ విజయ వినీల్ కుమార్, సీడెప్ జిడిఎం హైమావతి, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, ఎపిఎస్ఎస్‌డిసి, సిడెప్ ఉద్యోగులున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, కౌన్సిలర్ శివకోటరెడ్డి, స్కిల్‌హబ్ కేంద్ర నిర్వాహకులు విజయ్, వినయ్ కుమార్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మి, హెచ్ఒడి వెంకట రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి-వరికుంటపాడు** : మండలంలోని జి .కొండారెడ్డిపల్లిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఆ పథకాలు అందుతు న్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల వద్ద ఏవైన సమస్యలు ఉంటే వాటిని తీసుకొని వాటికి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సయ్యద్‌ఇక్బాల్, ఎంపిడిఒ విజయ భాస్కరరావు, తదితరులున్నారు.

**ప్రజాశక్తి-కోవూరు** : కోవూరు మండలం, పాటూరు గ్రామ సచివాలయం లో జరిగిన జగనన్న సురక్ష పథకం పై మండల సచివాలయం కన్వీనర్. కవరగిరి ప్రసాద్ అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన జెసిఎస్ కన్వీనర్ కవరగిరి ప్రసాద్ మాట్లాడారు. సచివాలయం కన్వీనర్లు విజయ సేనా రెడ్డి, శ్రీధర్ రెడ్డి , సాయి లక్ష్మీ, వాలంటీర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం** : జగనన్న సురక్ష పథకంతో అర్హులైన వారిని గుర్తిస్తున్నట్లు నగర పంచాయతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. ఈ సందర్భంగా నాలుగో వార్డులోని బాలకష్ణనగర్ గిరిజన కాలనీలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, తహశీల్దార్ సుధీర్, వైసిపి నాయకురాలు ప్రవళిక పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-ఉదయగిరి** : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలందరూ సద్విని యోగం చేసుకోవాలని తహశీల్దార్ వి.జగదీష్ బాబు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామ, వార్డు సచివాల యంలో ప్రతి కుటుంబంలోని పౌరులకు 11 సర్వీసుల వినతులు ప్రజల వద్ద నుండి స్వీకరించి వారికి సర్వీస్ ధృవపత్రాలు అందజేస్తామన్నారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## వలంటీర్లు ప్రతి ఇంటినీ సందర్శించాలి

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**



వలంటీర్లు క్లస్టర్ వారీగా ప్రతి ఇంటిని సందర్శించాలని జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.వెంకటరావు అన్నారు. మండలంలోని చెర్లోయడవల్లి గ్రామ సచివాలయాన్ని శనివారం పిడి సందర్శించారు. ఈ సందర్భంగా పిడి వెంకటరావు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 7 రోజుల ముందుగా వలంటీర్లకు మొబైల్‌లో జగనన్న సురక్ష యాప్ ఓపన్ అవుతుందని తెలిపారు. వలంటీర్లు 100శాతం సర్వే పూర్తి చేసి ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలో చూడాలని తెలియజేశారు. వలంటీర్ క్లస్టర్ వారిగా ప్రతి ఇంటిని సందర్శించి జగనన్న సురక్ష యాప్ ఓపన్ చేసి వారి వివరాలు నమోదు చేశారు. ఆయనవెంట ఎంపిడిఒ పి.ఐజాక్ ప్రవీణ్, చెర్లోయడవల్లి నోడల్ అధికారి ఎం.శిరీషా, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగుండాలి

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

ప్రతి ఒక్కరూ చట్టాలు రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి బి.రాజేష్ అన్నారు. శనివారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అడ్వకేట్ ఎల్వి రమణయ్య, తహశీల్దార్ లక్ష్మీనరసింహ, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యా కానుక కిట్లు పరిశీలన

**ప్రజాశక్తి-ఉదయగిరి**

ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న విద్య కానుక కిట్లు పంపిణీ మనబడి నాడు-నేడు పనులు పరిశీలించినట్లు ఎంఇఒ-2 తోటా శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పాఠశాలను సోమవారం స్థానిక పట్టణం లోని పాఠశాలలో జరిగే పేరెంట్స్ కమిటీ మీటింగ్ పరిశీలిస్తున్నట్లు మంగళవారం చుట్టుపక్కల గ్రామాల్లో జరుగుతున్న మనబడి నాడు-నేడు ఫేస్-2 పరిశీలిస్తామన్నారు. ఏడాది అకాడమిక్ క్యాలెండర్‌ను తప్పక పాటిస్తూ విద్యా ప్రమాణాలు పెంపొందించేలా కృషి చేయాలన్నారు. అలసత్వం ప్రదర్శించిన ఉపాధ్యాయులపై చర్యలు తప్పవన్నారు.

## ముగిసిన అంతర్జాతీయ సదస్సు

**ప్రజాశక్తి-కావలి** : పి.బి.ఆర్. విశ్వోదయ ఇంజనీరింగ్ కాలేజ్‌లోని ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విభాగంలో "కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్‌లో ప్రస్తుత పురోగతి" అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. వివిధ దేశాలు, మన దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి పరిశోధకులు సమర్పించిన పత్రాలను పై క్షుణ్ణంగా చర్చ నిర్వహించారు. దాదాపు వందకు పైగా పరిశోధకులు ఆన్‌లైన్, అఫ్‌లైన్‌లో పాల్గొని తమ పరిశోధన ఫలితాలను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా ఐఐటి తిరుపతి నుంచి విచ్చేసిన డాక్టర్ విక్రమ్ కుమార్ పూడి 5జీ టెక్నాలజీ ఆవిర్భావం వల్ల ప్రయోజనాలు, జీవన విధానంపై 5జీ ప్రభావాన్ని వివరించారు. విక్రమ్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో డ్రైవర్ లేని వాహనాలతో రోడ్డు ప్రమాదాలు లేని సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. ముఖ్యవక్తగా వెల్లూరు ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ నుంచి విచ్చేసిన డాక్టర్ విజేంద్రబాబు ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చేసిన టెక్నాలజీతో తనంతట తానే పనిచేసే తెలివైన ఐటి విధానాలు ప్రజా జీవనాన్ని సుఖవంతంగా మార్చ నున్నటు తెలిపారు. ఈసిఈ విభాగ అధ్యాపకులు, నిర్వాహకులను అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ భాగవతుల దత్తాత్రయ శర్మ అభినందించారు. కార్యక్రమంలో కో - కన్వీనర్లు డాక్టర్ హయాత్ రజ్వి, డాక్టర్ వెంకటేషన్, వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీనాథ్ రెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, వాసిలి ఎస్‌సి కాలనీలో విద్యార్థులకు ఆత్మకూరు బైపాస్‌లోని ఆభయ ఆంజనేయ స్వామి ధర్మకర్త సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, చెలికా రామా స్థానిక వైసిపి నాయకులు చెలికా హరిబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్, శ్రీలేఖ వైస్ చైర్మన్ కావ్య ప్రధానోపాధ్యాయులు, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సుధ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కామాక్షితాయి దేవస్థానంలో పూజలు

**ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం**

జొన్నవాడలోని మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానంలో వారం రోజులు పాటు మహా కుంభాభిషేకం మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరుగుతుంది. అనంతరం జగద్గురువులు శ్రీ శ్రీ శ్రీ కంచి పీఠాదీశ్వరులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి అనుజ్ఞతో మండల దీక్ష పూజా కార్యక్రమాలు శనివారం ఉదయం ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కోవూరు శాసన సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి సహాయ సహకారంతో, కుంభాభిషేక మహోత్సవానికి దాతలు గౌరవ రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, హైదరాబాద్ వాసులు కొలాన్ రాజారెడ్డి, ధర్మపత్ని పూజిత దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. దేవస్థాన చైర్మన్ పుట్టా లక్ష్మి సుబ్రహ్మణ్యం నాయుడు, దంపతులు, దేవస్థాన సహాయ కమిషనరు, కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు దంపతులు ఉభయకర్తలను ఆలయ సాంప్రదాయం ప్రకారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు.

## కార్మికుల ఉద్యోగ భద్రతకు పోరాటం

**ప్రజాశక్తి-నెల్లూరు**

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులందరికీ ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ దశల వారీగా నిరసన ధర్నా కార్యక్రమాలు నగరంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానని ప్రతిపక్షంలో ఉన్న సందర్భంలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. హామీలు ప్రభుత్వం అమలు చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు. నగరపాలక సంస్థలో పనిచేయుచున్న కార్మికులు వివిధ రకాల సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పిఎఫ్, ఈఎస్ఐ బెనెఫిట్స్ అందడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మిక చట్ట ప్రకారం వర్తించాల్సిన సెలవులు కార్పొరేషన్ అధికారులు అమలు చేయడం లేదంటూ వాపోతున్నారు. కార్పొరేషన్‌లో పని చేస్తున్న అన్ని విభాగాల కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డు, సెమిస్కిల్ జీతాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని,లేని పక్షంలో ఆందోళన ఉదతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం కార్మికుల పోరాటానికి దిగి వచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తుందో లేదో వేచి చూడాల్సి ఉంది. విద్యుత్తు సంస్కరణల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీలను పెంపుదల చేసి ప్రజాధనాన్ని దోపిడీ చేస్తుందని, రకరకాల ఛార్జీల పేరుతో ఇటీవల ప్రభుత్వం పెంచిన కరెంటు ఛార్జీలను వెంటనే తగ్గించాలని వామపక్షాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో నగరంలో నిరసన కార్యక్రమాలు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆందోళనను తీవ్రతరం చేసే క్రమంలో ఈ నెల 30వ తేదిన బహిరంగ సభ నిర్వహణకు సన్నాహాలు ప్రారంభించాయి. ప్రభుత్వం విద్యుత్ బిల్లులపై ట్రూఅప్ ఛార్జీలు, సర్‌చార్జీలు, ఫిక్స్‌డ్ చార్జెస్, కస్టమర్ ఛార్జి, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, ఇంట్రస్ట్ ఆన్ ఈడీ, గ్రిడ్ చార్జ్, షార్ట్ ఫాల్, లాస్/గెయిన్, ఎఫ్‌పీపీసీఏ చార్జెస్, అరియర్స్, ఇతర రుసుముల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపడం దారుణమంటూ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ఏప్రిల్ 2014 నుంచి మార్చి 2019 మధ్య వినియోగించుకున్న యూనిట్ల విషయంలో యూనిట్‌కు 7 పైసలు చొప్పున మొత్తంగా ఆగస్టు 2022 నుంచి జనవరి 2024 వరకూ 18 వాయిదాల్లో దీన్ని వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దుర్మార్గ చర్యలుగా పేర్కొంటున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాశితులందరికీ రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నెల్లిపాక నుంచి విజయవాడ వరకు సిపిఎం నిర్వహిస్తున్న మహాపాదయాత్ర లో స్వచ్ఛందంగా ప్రజలు, రాజకీయ పార్టీలు పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఈ మహాపాదయాత్రలకు సంబంధించిన గోడ పత్రికను నాయకులు ఆవిష్కరించారు. యువగళం పేరుతో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన కనిపిస్తుంది. ప్రజల నుంచి కనిపిస్తున్న ఆదరణ చూసిన వైసిపి నాయకులు టిడిపి నాయకులపై విపరీతమైన పదజాలాలతో దూషణ పర్వం కొనసాగిసు ఒకరిపై మరొకరు సవాల్ విసురుకుంటున్నారు.

వీక్షణం